గంగమ్మ దీవెనలతో ప్రజలు చల్లంగా ఉండాలి


మాజీ ఎమ్మెల్యేను సత్కరిస్తున్న అధికారులు

లక్కిరెడ్డిపల్లి : గంగమ్మ తల్లి దీవెనలతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి ఆకాంక్షించారు. గంగమ్మ జాతర సందర్భంగా స్థానిక ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్యలతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు చెల్లు గంగరాజు, ప్రత్యేకాధికారి శ్రీనివాసులు వారిని దుశ్శాలువాలతో సత్కరించి ఆలయ మర్యాదలతో తీర్థప్రసాదాలు అందజేశారు.

ఏఎస్‌ఐకి ఆత్మీయ వీడ్కోలు


ఏఎస్‌ఐను సన్మానిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్‌ఐకి జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు (పదవీ విరమణ) పలికారు. శుక్రవారం ఆయన జిల్లా ఎస్పీ కార్యాలయంలో వీడ్కోల్ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఏఎస్‌ఐ పోలు వెంకటేశ్వరావు కోర్టు లైజనింగ్ ఆఫీసర్‌గా విశేషమైన సేవలను అందించారని కొనియాడారు. అనంతరం ఆయనను సతీసమతేంగా పూలమాల, దుశ్శాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్యే ఆకేపాటితో పొన్నవోలు భేటి


ఎమ్మెల్యే ఆకేపాటితో భేటి అయిన పొన్నవోలు, కొరముట్ల, నాయకులు

రాజంపేట రూరల్ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డితో మాజీ అసిస్టెంట్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి భేటి అయ్యారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌కు శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులుతో కలిసి పొన్నవోలు విచ్చేశారు. ఆకేపాటితో పలు విషయాలపై చర్చించారు. వీరితో పాటు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షులు ఏటీ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది నాగిరెడ్డి, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు నాయినపల్లి అనుదీప్, యూత్ అధ్యక్షుడు శివ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

పెనగలూరు : మండలంలోని సింగనమల శివాలయం, తూర్పుపల్లి వద్ద గోడ మల్లేశ్వరస్వామి ఆలయం, కోమంతరాజపురం వద్ద నాగమల్లేశ్వరస్వామి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సింగనమలలో మూడు రోజులుగా అన్నదాన కార్యక్రమం ప్రతిరోజూ నిర్వహించారు.

అభివృద్ధి చేయని మీరు మాపై విమర్శలా?

జనసేన నాయకుడు తాతంశెట్టి విమర్శలను తిప్పికొట్టిన వైఎస్సార్‌సీపీ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : జనసేన నాయకుడు తాతంశెట్టి నాగేంద్ర తన అర్హత ఏంటో తెలుసుకొని నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని శుక్రవారం జెడ్పీటీసీ రత్నమ్మ, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వరమ్మలు తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు గురించి మాట్లాడే ముందు అర్హత తెలుసుకొని మాట్లాడాలన్నారు. నీవు నీతులు మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. కోడూరు పట్టణంలో చిరు వ్యాపారస్తులకు మేము అండగా ఉండి వారి బతుకుదెరువుకు రూ. 30 లక్షలు సొంత నిధులతో ఏడాది రుసుం కడితే మీరు చిరు వ్యాపారులను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. మీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొమ్మిది నెలల్లో ఏమి చేశారో చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. మీ అధినేత దగ్గరే డబ్బులు వసూలు చేసిన వ్యవహారం ప్రజలకు తెలుసు అని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు గత ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకమైన దశాబ్దాలుగా పరిష్కారం కాని ఎన్నో సమస్యలను పరిష్కరించి నిర్మాణాత్మకంగా వ్యవహరించారనేది గుర్తించుకోవాలన్నారు. రైల్వేకోడూరు అభివృద్ధి ఘనత కొరముట్లకే దక్కుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో తాగు నీరు, సీసీ రోడ్డు లాంటి అభివృద్ధి పనులు కరోనా కష్టకాలంలోనూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పనులు చేసి అభివృద్ధి చేసిన ఘనత తమకే దక్కుతుందన్నారు. తాము మంజూరు చేసి ఎనభై శాతం పూర్తి చేసిన పనులకు మీరు టెంకాయలు కొట్టి పనులు చేపడుతున్నట్టు చూపించుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రెస్ మీట్‌లో మీ పక్కన కూర్చున్న మహేష్ విషయంలో మీరు ఏమి చేశారో అందరికీ తెలుసు అని వారు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అభివృద్ధి పనులు గ్రామాల్లో ఎవరిని అడిగినా చెప్తారన్నారు. మీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడంలేదో ప్రజలకు చెప్పాలన్నారు. అభివృద్ధి పనుల శిలాఫలకాలు ధ్వంసం చేసే నీచ సంస్కృతి మీదని విమర్శించారు. మీరు ప్రభుత్వంలోకి వచ్చాక కోడూరులో ఏమీ చేశారో ధైర్యంగా చెప్పుకోలేకపోవడం మీ పనితనాన్ని తెలియజేస్తోందన్నారు. ఏనుగుల దాడిలో చనిపోయిన వారిని పరామర్శించి వారికి అండగా ఉండాల్సిందిపోయి మీ నాయకుడు వారిని దోషులగా చిత్రీకరించడం తప్పు కాదా అని వారు ప్రశ్నించారు. స్థాయి మరచి మాట్లాడితే ఇకపై ఊరుకునేది లేదని తెలియజేశారు. కార్యక్రమంలో దా మర్ల సిద్దయ్య, డివి రమణ, ఎంపీటీసీల లత, ప్రమీల, గౌషియా, ముత్తయ్యలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆప్కాస్ రద్దు యోచన విరమించుకోవాలి

రాయచోటి అర్బన్ : ఆప్కాస్ రద్దు యోచనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథనాయక్, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్, డిమాండ్ చేశారు. పట్టణం లోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంట్రాక్టు వర్కర్స్‌ను పర్మనెంట్ చేస్తామని, సమాన పనికి తగిన వేతనం ఇస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక మరచిపోవడం దారుణమన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తామని మంత్రి వర్గంలో నిర్ణయం తీసుకోవడం తగదని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పెద్దలు కార్మిక హక్కులకు వ్యతిరేకంగా పనిభారం పెంచుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సుధీర్‌కుమార్, ఎం.సుమిత్ర, వంగిమళ్ల రంగారెడ్డి, పండుగోలు మణి, మాధవ్‌కుమార్, జక్కల వెంకటేష్, ముబారక్, దేవ, తిరుమల, నాగరాజు, ఇంద్రాణి, పృథ్వీరాజ్, ఓబులేసు, నందు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనలతోనే సమాజాభివృద్ధి

సిద్దవటం : శాస్త్రీయ ఆలోచన ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సమీర్‌బాషా అన్నారు. సిద్దవటం మండలంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమం జరిగింది. ముందుగా ఆయన సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమీర్‌బాషా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. తద్వారా కొత్త విషయాలను తెలుసుకోవాలని, సైన్స్ జగతికి మూలం కాబట్టి సైన్స్‌లో అవగాహన పెంచుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుడు సుధాకర్ మాట్లాడుతూ ఈరోజు సర్ సి.వి.రామన్ రామన్ ఎఫెక్టును కనుగొన్న రోజని ఇందుకు గాను ఆయనకు నోబెల్ బహుమతి వరించిందన్నారు. అనంతరం సమీర్‌బాషా వివిధ రకాల మ్యాజిక్‌లు చేసి వాటి వెనుక ఉన్న సైన్స్ లాజిక్‌ను కూడా తెలియజేశారు.

పుల్లంపేట : దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జాతీయ విజ్ఞాన (సైన్స్) దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వివిధ సైన్స్ ప్రాజెక్టులు వివిధ డ్రైఫ్రూట్స్‌తో తయారు చేసిన శరీర అవయవాలు, అట్ట ముక్కలతో తయారు చేసిన సర్వమత సమ్మేళనాన్ని తెలిపే మసీదు, చర్చ్, గుడి నిర్మాణాలు, ఎర్రకోట వివిధ రకాల ఇల్లు, ప్లాస్టిక్ బాటిల్స్‌తో చేసిన పెన్ స్టాండ్, పెన్సిల్ బాక్స్, సౌర కుటుంబ నమూన, చంద్రయాన్ రాకెట్ మోడల్ తయారుచేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ పిల్లలు మొదటి శాస్త్రవేత్తలు అని, వారి ఆలోచనలకు మనం మార్గదర్శకత్వం ఇస్తే అద్భుతాలు సృష్టించగలరన్నారు.


పుల్లంపేట: తయారుచేసిన ప్రాజెక్టులతో విద్యార్థులు

అంగరంగ వైభవంగా త్రేతేశ్వరుడి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్త జన సందోహం

రాజంపేట రూరల్ : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఏడవ రోజు శుక్రవారం శ్రీ కామాక్షి సమేత శ్రీత్రేతేశ్వర స్వామికి రథోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి అనంతరం ప్రాధాన్యత ఇచ్చే కార్యక్రమాల్లో ప్రధానమైనది రథోత్సవం. దేవదేవేరులను రథంలో తిలకించడానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. రథంలో కొలువుదీరిన శ్రీకామాక్షి సమేత శ్రీత్రేతేశ్వర స్వామిని దర్శించుకొని భక్తులు తరించారు.

సచివాలయాలు ఆకస్మిక తనిఖీ

పెనగలూరు : మండలంలోని పలు సచివాలయాలను శుక్రవారం ఎంపీడీఓ విజయారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలాయలలో పనిచేసే సిబ్బంది రిజిస్టర్ పరిశీలించి సమయానికి విధులకు హాజరువుతున్నారా లేదా అన్న విషయంపై ఆరా తీశారు. నారాయణ నెల్లూరు, నల్లపురెడ్డిపల్లి, అనంతపల్లి, సింగారెడ్డిపల్లి, చక్రంపేట తదితర సచివాలయాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపుల్లో కార్మికులకు అన్యాయం

రాయచోటి అర్బన్ : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో కార్మికులకు అన్యాయం జరుగుతోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.చంద్రశేఖర్, సీఐటీయూ జిల్లా కమిటీ కార్యదర్శి ఎ.రామాంజులు, కోశాధికారి హరిశర్మ తెలిపారు. విలేకరులతో శుక్రవారం వారు మాట్లాడుతూ వేతనాల కోసం పని చేస్తున్న కార్మికులకు బడ్జెట్ కేటాయింపుల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం దారుణమన్నారు. గ్రాట్యూటీ అమలుపై ఎలాంటి జీవో ఇవ్వకుండానే, హామీ అమలు చేసిన ఘనత తమదేనని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అంగన్‌వాడీ, ఆశ, వీఓఏ, గ్రామ పంచాయతీ వర్కర్లు, స్కీం వర్కర్ల వేతనాల పెంపు ప్రస్తావనే లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులు, ఉద్యోగుల జీతాల పెంపునకు మార్పులు చేయాలంటూ కోరారు.

ఎమ్మెల్యే దృష్టికి మండల సమస్యలు

వీరబల్లి : మండల సమస్యలను రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని వివిధ సమస్యలపై వారు ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ రాబోయే లోకల్ స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలని సూచించారు.

ఉత్కంఠ భరితంగా బండలాగుడు పోటీలు


రసవత్తరంగా సాగుతున్న బండలాగుడు పోటీలు

రాజంపేట రూరల్ : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అత్తిరాల గ్రామంలో నిర్వహించిన జిల్లా స్థాయి బండలాగుడు పోటీలు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగాయి. కడప జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 5 జతల ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఈ ప్రాంత ప్రజలు బండలాగుడు పోటీలను తిలకించేందుకు ఎంతో ఆసక్తి చూపుతారు. దీంతో మూడు గంటలకు బండలాగుడు పోటీలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు ప్రకటించినప్పటికి మధ్యాహ్నం ఒంటి గంట నుంచే రాజంపేట మండలంలోని గ్రామాల ప్రజలే కాక నందలూరు, పెనగలూరు, పుల్లంపేట మండలాలకు చెందిన ప్రజలు సైతం వేలాదిగా తరలివచ్చారు. దీంతో అత్తిరాల గ్రామం జనంతో కిక్కిరిసిపోయింది. ఎడ్ల యజమానులు సైతం తమ ఎడ్లు గెలవాలన్న పట్టుదలతో వాటిని ముందుకు నడిపించేందుకు శత విధాల ప్రయత్నించారు. ఎడ్లు బండను వేగంగా లాగే సమయంలో ప్రజలు గట్టిగా ఈలలు వేస్తూ మరింత ఉత్సాహ పరిచారు. పోటీల్లో ప్రొద్దుటూరు మండలం రంగసానిపల్లి గ్రామానికి చెందిన మర్తల వెంకటసుబ్బారెడ్డి ఎడ్లు 20 నిమిషాలలో 1332 అడుగులు బండలాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.50 వేలు దక్కించుకున్నాయి. అలాగే వేముల మండలం బెస్తవారిపల్లి గ్రామానికి చెందిన గాం. దీపెంట జతిన్‌విహాన్ ఎడ్లు 1066 అడుగులు లాగి రూ.40వేలు ద్వితీయ బహుమతిని గెలుచుకున్నాయి. మైదుకూరు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మూలే సూరారెడ్డి చెందిన ఎడ్లు 769 అడుగులు బండలాగి మూడవ స్థానంలో నిలిచి రూ.30 వేలు దక్కించుకున్నాయి. ఖాజీపేట మండలం పత్తూరు గ్రామానికి చెందిన కవ్వా బాలయ్య ఎడ్లు 747 అడుగులు లాగి నాల్గవ స్థానంలో నిలవడంతో రూ.20 వేలు దక్కించుకున్నాయి. చాపాడు మండలం చెందిన రాజువారిపేట గ్రామానికి చెందిన లింగారెడ్డి ఎడ్లు 661 అడుగులు లాగి ఐదవ స్థానంలో నిలిచి రూ.10 వేలు దక్కించుకున్నాయి.

వీరభద్రుడి ఆలయంలో వైభవంగా చండీ హోమం

రాయచోటి టౌన్ : జిల్లా కేంద్రంలో కొలువైన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం శ్రీ అమ్మవారి ఆలయానికి ఎదురుగా ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు మఠం ఓంకార స్వామి మంత్రోచ్చరణల మధ్య ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, శంకరయ్య స్వామి, శేఖర్ స్వామి, వేదపండితులు రాచరాయ యోగీ స్వామి ఆధ్వర్యంలో హోమ పూజలు జరిగాయి. హోమం నిర్వహణకు నలంద స్కూల్ యజమాని రోహిణి, ప్రభాకర్ పిళ్లై పూజా సామగ్రి అందజేయగా, వచ్చిన భక్తులకు శ్రీ రామానంద రైస్‌మిల్ యజమాని యం. కిరణ్‌కుమార్, యం. విజయ కుమార్, యం.కాంతమ్మ వారి కుటుంబ సభ్యులు అందజేశారు.


చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

పట్టువస్త్రాలు సమర్పణ

వీరబల్లి : మండల కేంద్రం సమీపంలో ఉన్న కెఎం పల్లె గంగమ్మ బోనాల పండుగ సందర్భంగా మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి చేతులమీదుగా అమ్మవారికి శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపించారు. ఆయన వెంట గ్రామస్తులు, నాయకులు, భక్తులు ఉన్నారు.


పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి

నేటి పొదుపే రేపటి భవిష్యత్తు

రాయచోటి టౌన్ : నేడు మనం చేసే పొదుపే రేపటి భవిష్యత్తునిస్తుందని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జి.ఆంజనేయులు అన్నారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించే 'పొదుపు చేసే వనితా సాధిస్తోంది ఘనత'అనే కార్యక్రమాన్ని స్థానిక మెప్మా కార్యలయంలో మెప్మా సీఎంఎం అబ్బాస్ అధ్వర్యంలో మహిళలకు పొదుపుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారికి పొదుపు, పెట్టుబడులు, సాధించిన విజయాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు మహిళలకు పొదుపు సంఘాల ద్వారా ఎంతో ఆర్థికంగా పురోగతిని సాధిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీఓలు రమణమ్మ, నాయుడు, కల్యాణ్, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



గంగమ్మ జాతరకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- క్యూలైన్లు, చలువ పందిళ్లు ఏర్పాటు
- అమ్మవారి పూజల్లో వేలాది భక్తులు
- జాతర ప్రాంగణానికి చేరిన గంగమ్మ

లక్కిరెడ్డిపల్లె : భక్తుల ఇలవేల్పు అనంతపురం గంగమ్మ జాతరకు ప్రారంభమైంది. వేలాది భక్తుల సందర్శనార్థం నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో క్యూలైన్లు, చలువ పందిళ్లు, బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. మహిళలకు తాత్కాలిక స్నానపు గదులు, తాగునీరు, విద్యుత్తు సమస్య తలెత్తకుండా ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు మదన్ మోహన్, పూజారులు చెల్లుగంగరాజు, ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. విద్యుద్దీపాలంకరణలో ఆలయానికి నూతన శోభ సంతరించుకుంది. అన్నమయ్య జిల్లా ఆర్డీఓ శ్రీనివాసులు జాతర ఏర్పాట్లను పరిశీలించారు. రాయచోటి డీఎస్పీ క్రిష్ణమోహన్, లక్కిరెడ్డిపల్లె సీఐ వెంకటకొండారెడ్డి,, ఎస్ఐ రవీంద్రబాబు సిబ్బంది ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. గంగమ్మ దేవత అమ్మవారి అలంకరణకు పెండ్లిమర్రి మండలం బాలయ్యగారిపల్లెకు చెందిన కానాల గంగిరెడ్డి రూ.3 లక్షలు ఖర్చు చేయనున్నారు.

ఆలయానికి చేరిన గంగమ్మతల్లి

మండలంలోని అనంతపురం గ్రామం గొల్లపల్లెలోని గంగమ్మ తల్లికి చెల్లు వంశీయులైన చెల్లు గంగరాజు, దినేష్ కుమార్, పూజారులు సురేంద్ర కుటుంబసభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఏటా దాగిరి(బుట్ట)లో అమ్మవారిని వుంచి మూసి వేస్తారు. శుక్రవారం పార్వేట అమావాస్య రోజున దాగిరిలో ఉన్న అమ్మవారిని శుద్ధజలంతో అభిషేకించి గ్రామంలో ఊరేగించారు. డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుస్తూ గంగమ్మను ఆలయంలోకి తీసుకెళ్లారు. ఆలయంలోకి ప్రవేశించగానే జాతర ప్రారంభానికి సూచన ప్రాయంగా భక్తులు చెబుతారు.

చాగలగుట్టపల్లెనుంచి..

మండలంలోని చాగలగుట్టపల్లెలో గంగమ్మ తల్లికి శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య రోజున అమ్మవారిని పూజలు చేసి బయట ఉంచారు. జాగారంలో భాగంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మరుసటి రోజు తెల్లవారుజామున అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అప్పలరాజుగారిపల్లె, మార్లవాండ్లపల్లి, మర్రిచెట్టు, చౌటపల్లెల మీదుగా పోలీసుల బందోబస్తు నడుమ ఊరేగింపుగా అనంతపురం గంగమ్మ ఆలయంలోకి తీసుకెళ్తారు. ఊరేగింపులో దారి పొడవునా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. సీఐ కొండారెడ్డి, ఎస్ఐ వినోద్‌కుమార్ పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశారు.


అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు